బ్రహ్మరాతను తారుమారుచేసే మనిషి స్వార్థానికి అంతం ఎక్కడ?

చిలుకూరి దేవపుత్ర కథ

# ఆపద్ధర్మం

ఆరోజు పెళ్ళిచూపులుండంతో ఆఫీసుకి సెలవు పెట్టేసింది కావ్య.

ఉదయం లేచిన దగ్గర్నించీ ఆ ఇంట్లో ఒకటే హడావిడి, సందడీనూ. కావ్యతల్లీ, ఇద్దరు చెల్లెళ్ళూ, వంటావార్పూ చేయడాలూ, ఇంటిని పరిశుభ్రంగా ఉంచే పనులూ ముమ్మరంగా సాగిస్తున్నారు. తమ్ముడేమో టేబుల్ ఫ్యాన్‌కు పట్టిన దుమ్ముని దులిపేసి నీట్‌గా తుడుస్తూ ఉన్నాడు. కావ్యమాత్రం అద్దంముందునుంచీ లేవకుండానే ముస్తాబు అవుతూ వుంది.

కావ్య నాన్న మధుసూదనరావు ఆరోజు డైలీ పేపర్లోని ప్రతి అక్షరాన్నీ పొల్లుపోకుండా అత్యంత శ్రద్ధతో చదివేస్తున్నారు.

కావ్య అందంగా అలంకరించుకుంది.

జరీ అంచు ఉన్న చెంగావి రంగు పట్టుచీరలోకి అదేరంగు బ్లౌజు వేసుకుంది. గాజులూ, బొట్టూ అదే రంగులో వున్నాయి. జడలోని కనకాంబరం పూలూ, అదేరంగులోనే వుండడం... దానికి తోడు పసిమిరంగు మేనిఛాయనీ కలగలిపి చూస్తే ఆమె ఆ అలంకరణలో అందంగా ఉన్నదో, లేదా ఆమె అందగత్తె అయి వుండడంవల్ల ఆ అలంకరణ గొప్పగా ఉన్నదో ఒక్కన చెప్పడం ఎవరికైనా కష్టం! మొత్తంమీద చెప్పాలంటే దివినుండి భువికి దిగిన 'అప్సర శిరోమణి వరూధిని'లా ఉంది కావ్య.

కావ్యకి పెళ్ళిచూపులు ఇదేం మొదటిసారికాదు. ఏ ఇరవయ్యోసారో, ఇరవై ఒకటోసారో...

అసలు పెళ్ళిచూపులంటేనే కావ్యకి జుగుప్సా, విసుగూ కలిగేవి మొన్నమొన్నటివ




రకూ. ఎవడో ముక్కు మొహం తెలీనివాళ్ళ మధ్యన తమ అందంగా పుత్తడిబొమ్మలా అలంకరించుకుని వెళ్ళి తలవొంచుకుని కూచోడాలూ, ఎలుగుబంటిలాగనో, ఖడ్గమృగం లాగనో ఉన్న వాళ్ళుకూడా పెద్ద ఫోజులు పెట్టేసి తనని ఇంటర్వ్యూలు చేయడాలూ, గోదురుకప్ప స్వరానికి మల్లే మాట్లాడేవాళ్ళు కూడా 'నీకు సంగీతం వచ్చా' అంటూ ఏదీ

ఓ పాటపాడు!' అంటూ అడగడాలూ తనకి కంపరం పుట్టించేవి.

తను అన్నివిధాలా నచ్చినా కట్నం దగ్గర పేచీపడి వెళ్ళిపోయిన మహానుభావుల్ని చూసింది తను. అందుకే పెళ్ళిచూపులు అనేసరికి 'గండం'లా అనిపించేది.

అయితే ఈసారి పెళ్ళిచూపులు మాత్రం జుగుప్సగానూ, కంపరంగానూ, గండంగానూ అనిపించడంలేదు కావ్యకి. ఎంచేతంటే మరీ ముక్కూ మొహం తెలీని వాళ్ళెదుట వెళ్ళి కూచోవడంలేదు తను. ఆ పెళ్ళికొడుకు శ్రీరామ్ తన చిన్నాన్నకొడుకు రఘుకి బాగా పరిచయస్తుడే! రఘు ఓ నెల క్రితం శ్రీరామ్ ఫోటోని కావ్యకి చూపెడుతూ— 'ధర్మవరంలో జరిగిన ఓ పెళ్ళిలో కావ్యని శ్రీరామ్ చూశాడనీ, అప్పట్నుంచీ కావ్యకోసమే తపిస్తున్నాడనీ, పెళ్ళంటూ జరిగితే కావ్యతోనే జరగాలని పట్టుపట్టాడని చెప్పాడు రఘు. ఆ విషయం వింటూ సంతోషంతో ఉక్కిరిబిక్కిరై మరీ సిగ్గుపడిపోయి "పో అన్నయ్యా!" అంది కావ్య. ఆరోజునుంచీ శ్రీరామ్ కావ్య మనసులో తిష్టవేశాడు. ఆ తర్వాత ఒకటి రెండుసార్లు తను పనిచేస్తోన్న ఆఫీసుకి వచ్చి ఏదో వంకలో తనని పలకరించి వెళ్ళాడుకూడా. 'ఇంతై... వటుడింతై' అన్న తీరులో ఆమెలోని అణువణువూ ఆక్రమించేశాడు శ్రీరామ్. శ్రీరామ్ అందగాడేకాదు. బ్యాంకు ఆఫీసరుకూడా.

"అమ్మా కావ్యా! రెడీ అయ్యావా?" అంటూ వచ్చింది శారదమ్మ.

"ఊ రెడీయే... ఇంకా అరగంట వుందమ్మా! వాళ్ళు పదిన్నరకి కదా వస్తామన్నారు" అద్దంముందునుంచి కదలకుండా జడకుచ్చుల్ని సవరిస్తూ అంది కావ్య.

"ఏమోనే మన గడియారమే ఆలస్యంగా పోతోందేమో! ఎందుకైనా మంచిది నువ్వు ఆ కిటికీలోంచి చూస్తూ వుండు. రోడ్డుమీద వాళ్ళు కనిపిస్తూనే నన్ను పిలువు. ఎదురువెళ్ళి ఆహ్వానిస్తాను!"

"అవును పాపం! నువ్వు ఆహ్వానించకపోతే ఆ వచ్చినవాళ్ళు అలాగే వెనక్కి వెళ్ళిపోగలరు!" అన్నాడు మధుసూదనరావు హాస్యమాడుతూ.

"ఏం వెళ్ళరుకానీ... వాళ్ళు సరాసరి ఇంట్లోకి దూసుకొచ్చేసి మీ పేపర్లోకి తలలుదూర్చి చదువుతూ కూచుంటారేమోనని నా భయం" అంటూ భర్తకి ఓ తిరుగుబాణం వేసి" అన్నీ వేళాకోళాలే... ఇంకా కాఫీ తయారుచేయాలి" అంటూ తనలో తనే మాట్లాడుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది శారదమ్మ.

ఆమె హడావిడి చూసి తండ్రీకూతురూ నవ్వుకున్నారు.

మధుసూదనరావు నవ్వుతూనే మళ్ళీ పేపర్లోకి తలదూర్చేశాడు.

అద్దంలోంచి తండ్రిని చూస్తూ అదోలా విషాదంగా నవ్వుకుంది కావ్య. ఈ మధ్య తండ్రిని చూసినప్పుడల్లా అదోరకమైన జాలి కలుగుతోంది కావ్యకి. అందుకు కారణం ఆయన త్వరలో గవర్నమెంట్ సర్వీసులోంచి రిటైర్ అవబోతూ వుండడమే! తనేమో పెళ్ళిచేసుకుని అత్తారింటికి వెళ్ళిపోతుంది.

ఆ తర్వాత కుటుంబమంతా తండ్రి పెంషనుతోనే గడవాలి. ఇంకా ఇద్దరు చెల్లెళ్ళ

పెళ్ళిళ్ళూ అవి ఎలా చేస్తాడా? అనిపిస్తుంది కావ్యకి. అయితే నాన్నమాత్రం ఎప్పుడూ ఏ చీకూచింతాలేనివాడికి మల్లే కనిపిస్తారు. అవును అలా కనిపించేవాడే తన నాన్న! అలా అనుకున్నప్పుడు కావ్య కళ్ళల్లో నీటి పొర కదిలాడుతుంది.

***

"పెళ్ళయ్యాకకూడా కావ్య ఉద్యోగం చేస్తుందా?" అడిగాడు శ్రీరామ్. మధుసూదనరావుని ఉద్దేశించి.

"అదీ... పెళ్ళయ్యాక మీరూ, అమ్మాయి మాట్లాడుకుని నిర్ణయించుకోవలసిన విషయం కదండీ!" అంటూ చిరునవ్వు నవ్వాడు మధుసూదనరావు.

శ్రీరామ్, అతని అమ్మానాన్నలూ తృప్తిగా చూస్తున్నారు కావ్యని.

"మరి కట్నకానుకల విషయం... మా రఘు చెప్పినట్టూ..." అంటూ నీళ్ళు నమిలాడు మధుసూదనరావు.

"రఘూ ఏం చెప్పాడు?" అడిగాడు శ్రీరామ్ తండ్రి.

ఆ మాటకి కొంచెం ఇరుకున పడ్డట్టు కనిపించాడు మధుసూదనరావు.

"ఏమన్నాడంటే... అది మీ అబ్బాయి అన్నమాటేలెండి..."

"ఏమన్నాడో చెప్పండి! సందేహిస్తారెందుకూ?" అంటూ శ్రీరామ్ అనేసరికి సగం ధైర్యం వచ్చింది మధుసూదనరావుకు.

"కట్నమంటూ ఏమీ వద్దనీ... ఒక మోటర్‌బైక్ ఇస్తేచాలు అని... పెళ్ళి ఖర్చంతా మేమే అంటే ఆడపిల్ల పెళ్ళివాళ్ళమే భరించాలనీ..." అన్నాడు. 'నేను చెబుతోంది పొరపాటా' అన్న అనుమానంతో నిండి వున్నాయి మధుసూదనరావు మాటలు.

"కరెక్టేనండీ! మావాడికి కట్నాలమీద మోజేమీ లేదు. నిజానికి బ్యాంకు ఆఫీసరుకి మరొకరైతే లక్షన్నరకి తక్కువ డిమాండ్ చేయరు. అయితే మేమంత దుబారా మను



## చిన్నపిల్ల!

'డాక్టర్‌గారు డాక్టరుగారు మా ఆవిడ చిన్నపిల్లలా ప్రవర్తిస్తుందండీ...!'

'ఏమయ్యిందేమిటి?'

'నేను చిన్నచిన్న పడవలు చేస్కొని నీళ్ళల్లోవేసి ఆడుకొంటుంటే తీసి అవతలవేస్తుందండీ'

ఆ???

—వాసుదేవరెడ్డి పురుమాండ్ల (వాంచారుపల్లి)

షులంకాదులేండి!'' అన్నాడు శ్రీరాం తండ్రి.

ఆ చివరి వాక్యం మాత్రం 'మాకంతటి అదృష్టం లేదులెండి!' అన్నట్టుగా ధ్వనించింది మధుసూదనరావుకి.

పెద్దవాళ్ళు మాట్లాడుకుంటూ వుంటే తనకెదురుగా పీటమీద కూచుని వున్న కావ్య కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ఆమె గుండెలోతు ఎంతో కనుక్కుంటున్నాడు శ్రీరావ్.

అందరూ కాఫీలు తాగడం పూర్తయ్యాయి.

''ఇది మీకు ఎన్నో సంబంధమో మాకు తెలీదుకానీ బావగారూ! మాకు మాత్రం ఇదే మొదటిది... మంచి సంప్రదాయమున్న కుటుంబంలోని అమ్మాయికోసం చాలా రోజులుగా గాలిస్తున్నాం. మీ రఘు కనబడక పోయుంటే ఇంకా మా అన్వేషణ కొనసాగుతూ వుండేదేమో... ఏమైతేనేం మీ సంబంధం కుదిరింది. సంతోషం! అయితే ఒక్క మాటండీ బావగారూ! కట్నం అడగడంలేదుకదా అని మావాడిలో ఏదైనా వంక వుందేమోనని వెతక్కండి! కట్నం విషయంలో నేను ఎప్పుడూ వ్యతిరేకినే'' అన్నాడు శ్రీరావ్ తండ్రి లేచి నిలబడుతూ.

''ఎంతమాట! మీలాంటి సహృదయులు దొరకడం మా అదృష్టం. ముఖ్యంగా మా అమ్మాయి అదృష్టం మరి!'' అంటూ నవ్వుతూనే అందరితోపాటూ తను లేచి నిలుచున్నాడు మధుసూదనరావు.

''వీలైనంత త్వరలో ముహూర్తాలు పెట్టుకుందాం. ఏమంటారు బావగారూ!''

''మీ ఇష్టమే మా ఇష్టం!''

అవన్నీ వింటూ పెళ్ళికొడుకుని చూస్తో వుంటే స్వర్గలోకంలో విహరించినంత ఆనందంగా వుంది కావ్యకి.

శ్రీరావ్ కళ్ళతోటే వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిపోతోంటే కావ్య కళ్ళల్లో తడి తళుక్కున మెరిసింది. ఒక గంట వ్యవధిలోనే తన మనసునంతా దోచుకుని వెళ్ళిపోతున్నాడు'' అనుకుని లోలోనే హాయిగా, మెత్తగా, నిండుగా నవ్వుకుంది కావ్య.

***

రాత్రి ఒంటిగంట అవుతోంది...

ఎంతసేపటికీ నిద్రపట్టడంలేదు కావ్యకి

తన జీవితంలో అంత ఆనందాన్ని అనుభవించడం ఆరోజే మరి!

అతని ఓరచూపులూ!

అతని చిలిపి నవ్వులూ!!

ఎంత వాడి వుందో ఆ చూపులకి!

ఎంత మృధుత్వం వుందో ఆ పెదాల అంచుల్లో విరిసే నవ్వులకి!!

ఆ నవ్వులకి తళుకుల్ని అద్దే తెల్లటి పలువరస!

ఆ నవ్వులూ, ఆ చూపులూ, ఆ అందమైన విగ్రహం ఇక తన సొంతం కాబోతున్నాయి! అలా అనుకుంటూ వుంటే తన గుండెలు ఆనందాన్ని భరించలేక లయతప్పి కొట్టుకుంటున్నాయి. ఏ ఆడపిల్ల జీవితంలోనయినా పెళ్ళిచూపులు ఇంత బాగా జరిగి వుంటాయా? నిజంగా తను ఎంత అదృష్టవంతురాలో!

ఉదయాన్నే ఆఫీసుకి వెళ్ళేముందు ఈ విషయం లలితతో చెప్పాలి... అది ఈరోజే వచ్చి వుంటే ఎంత బావుండేదో... తప్పకుండా వస్తానంది. తనని ఓ ఆట పట్టిస్తానని

బెదిరించింది. జరిగిందంతా దానితో పూస గుచ్చినట్టు చెప్పాలి. అప్పుడు చూడాలి దాని మొహం ఎంత వికసిస్తుందో! తనకి మేలు జరిగితే సంతోషపడేవాళ్ళలో లలితే మొదటిది. తనకి ఉద్యోగం వచ్చినప్పుడు ఎంత సంతోషపడిందో లలిత! గట్టిగా కౌగిలించేసుకుని గిరగిర తిప్పేసింది తనని. దానికీ ఓ మంచి సంబంధం కుదిరితే ఎంత బావుంటుందో! అంత మంచి మనసున్నదానికి దేవుడు తప్పకుండా మేలుచేస్తాడు — మంచి మొగుడు దొరికి తీరుతాడు...

పక్కమీంచి లేచి మంచం పక్కనే ఉన్న కూజాలోంచి నీళ్ళు గ్లాసులోకి వంచుకుని నాలుగు గుక్కలు తాగి మళ్ళీ పడుకుంది కావ్య. కడుపంతా ఖాళీగా వుంది. సరిగా భోజనం చేయలేదు తను. మనసంతా ఎనలేని తృప్తీ, సంతోషమూ అలుముకుని వుంటే ఇక ఆకలి అన్నదానికి చోటెక్కడ వుంటుంది?

గోడ గడియారంవేపు చూసింది— 'అమ్మో! అప్పుడే ఒకటిన్నర! ప్రొద్దున్నే లేవాలి!'' అనుకుంటూ దుప్పటితో ముసుగుపెట్టుకుని పడుకుంది కావ్య. అయినా తన ఆలోచనా ప్రవంతికి ముసుగు కప్పగలుగుతుందా? అలలుగా ఆలోచనలు ఆమె మనసును ముంచేస్తున్నాయి.

***

''ఏమిటండీ... ఇంత రాత్రయినా ఇంకా నిద్రపోలేదా?'' అంది అప్పుడే బాత్రూమ్‌కి వెళ్ళొచ్చిన శారదమ్మ, భర్తతో అతని పక్కలోనే మేను వాలుస్తూ''

''నీకు నిద్రగురించే బెంగ — నాకు రేపు గురించి బెంగ''

''రేపు గురించి అంటే అమ్మాయి పెళ్ళిగురించేనా? ఇప్పటినుంచీ ఎందుకాలోచిస్తారు? ఏదోలెండి అమ్మాయి అదృష్టవంతురాలుకాబట్టి ఒక్క మోటార్ బైక్‌తోటే పోనిచ్చారు. ఇంకా లక్షలకొద్దీ డబ్బు, తులాల కొద్దీ బంగారం అడిగివుంటే ఏం చేసేవాళ్ళం?''

## పూజా భట్ పూజ!



''నాకో బాయ్ ఫ్రెండ్ కావాలోచ్! అర్జంట్‌గా చూడండో..'' అని ఇల్లెక్కి మరీ కూస్తోంది పూజా భట్.

''ఎందుకు పాపా! నీకు తోడు కావాలా'' అని అడిగితే..

''ఏం చేయను? నా ఫర్‌హాన్ అమెరికాలో చదూకుంటున్నాడాయె! నాకా ఇక్కడ బోర్ కొడుతోంది కాస్త రిలీఫ్‌గా....

బస్! బస్! ఇహ అబ్బాయిలు క్యూలు కట్టేస్తారు!

—విహారిక

ఆ మాటకు మౌనంగా వుండిపోయాడు మధుసూదనరావు.

"అవునూ... ఏమండీ... అమ్మాయి పెళ్ళి కాస్తా అయిపోతే అప్పుడుంటాయి మన తిప్పలు... ఏదో వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడైనట్లు అమ్మాయి జీతం డబ్బులు వస్తున్నాయి కాబట్టే సంసారం సవ్యంగా సాగిపోతోంది. దాని పెళ్ళి తర్వాత మనకు మొదలవుతాయి కష్టాలన్నీ" అంటున్న శారదమ్మ గొంతులో బాధ ధ్వనించింది.

"నేనిందాకా 'రేపు గురించి బెంగ' అన్నది అదే శారదా! ఇప్పటికైనా నా ఆందోళన అర్థమయ్యిందా? కావ్య మగపిల్లవాడై పుట్టి వుంటే ఎంత బావుండేదే... అది ఆడపిల్లగా పుట్టి మనల్ని ఇబ్బంది పెడుతోంది.

కొన్ని క్షణాలు బరువుగా దొర్లాయి.

"ముహూర్తం పెట్టుకోవడానికి శ్రీరామ్ వాళ్ళకి ఉత్తరం ఎప్పుడు రాస్తారు?" అంది శారదమ్మ. తొందరగా రాయమని కర్తవ్యాన్ని గుర్తుచేసే ప్రయత్నమది.

"అప్పుడే రాసేశాను" అన్నాడు నిర్లిప్తంగా.

"ఔనా! మరి చెప్పరేం... ఎప్పుడు రమ్మనీ... ఏమనీ?" అంది ఆశ్చర్యపోతూ.

"నువ్వేమీ అనను అంటే...."

"అంటే!?"

"వాళ్ళు మంచి సంప్రదాయ కుటుంబంలోని అమ్మాయిని చేసుకోబోతున్నామనికదా వాళ్ళు మురిసిపోయారు. అందుకే అది అబద్ధమని రాసేశాను... వాళ్ళని మోసగించడం ఎందుకు? నిజానికి మా అమ్మానాన్నల కులాలు వేరువేరుకదా! అమాటే 'ఆకాశరామన్న' రాసినట్టు ఉత్తరం రాశాను"

"మీరు అసలు... అసలు... తండ్రి చేయాల్సిన పనేనా? ఎంత పని చేశారండీ!!! ఆ విషయమిప్పుడు మిమ్మల్ని ఎవరడిగారు? ప్రస్తుతం మనది మంచి సంప్రదాయమున్న కుటుంబమేకదా! రఘుకి ఈ విషయం తెలిస్తే ఎంత బాధపడతాడో... బంగారంలాంటి సంబంధాన్ని పాడుచేశారు!" అంటూ ఆందోళనతో మాట్లాడుతోంది శారదమ్మ.

"నేనట్లా రాయడానికి కారణముంది శారదా! మరో నాలుగు నెలల్లో నేను రిటైరయిపోతున్నానా? ఇంత సంసారాన్ని నా పెన్షన్ డబ్బుతో ఎలా పోషించగలమ చెప్పు. అందుకే అలా రాశాను. అన్నీ తెలిసినదానివి మరోలా ఆలోచించకుండా నా పరిస్థితిని కొంచెం అర్థం చేసుకో" అనేసి మధుసూదనరావు అటువేపుకి తిరిగి పడుకున్నాడు.

శారదమ్మ కళ్ళల్లో కన్నీటిగంగ ఉబుకుతోంది. పక్క గదిలో ఆలోచనా ప్రవంతిలో ఓలలాడుతూ కావ్య.